రక్తయజ్ఞం

శ్రీ కలువకొలను సదానంద

(గత సంచిక తరువాయి)

అర్ధరాత్రి అయింది. మనుషులరద్దీ ఎక్కువై పోతోంది. జనంలో నలిగిపోతూ, గుంపు ఏవైపుకు నెట్టితే ఆవైపుకు నడుస్తున్నాడు సుందరం. ఎంతసేపు చూచినా ఆ జనాలే! ఆ దుకాణాలే! ఆ సందడిలో ఆడా మగా తేడా లేకుండా ఒకరినొకరు రాచుకుంటూ ముందుకు పోతున్నారు.

సుందరానికి విసుగువేసింది. అతడు ఒంటరిగా మిగిలిపోయాడు. ఏమిటో ఈ తిరణాల! ఎందుకు రావాలితాను? ... అతని ఉత్సాహం పూర్తిగా చచ్చిపోయింది.

సుందరం టీ తాగాడు.

చలివేస్తూవుంది. కళ్ళు నిద్రతో బరువెక్కుతున్నాయి. ఈ చలిని నిద్రను జయించాలి. అతడు అరచేతులు రుద్దుకుని ఒళ్ళు వెచ్చజేసుకున్నాడు. చేతిరుమాలుతో కళ్ళు నులుముకున్నాడు.

శివరాత్రినాడు జాగారంచేస్తే పుణ్యం వస్తుందంటారు

నిద్ర చాలా సుఖప్రదమైనది. అలాంటి నిద్రను త్యాగం చేయడం నిజంగా గొప్పపనే! నిద్రకాయడం నిజమైన ప్రేమకు, భక్తికి తార్కాణం!...నిద్రమేలుకున్న వాడల్లా భక్తుడేనా? తేలు కుట్టితే రాత్రంతా నిద్రపట్టదు. వాడుకూడా భక్తుడేనా? భర్త జబ్బుపడితే, భార్య రాత్రంతా మేలుకుని అతనికి సేవచేస్తుంది. ఆమె గొప్ప భక్తురాలు! భార్య ప్రసవవేదన పడుతుంటే, భర్తకు నిద్రపట్టదు. అతడు గొప్ప భక్తుడు!

ఇందరు జనాలు నిద్రకు దూరమై ఇక్కడ నడయాడుతున్నారు. వీళ్ళలో చాలమంది నిద్రపోకుండా వుండగలుగుతున్నందుకు కారణమేమిటి? చెబితే తప్పులేదు. మన కావ్యాల్లోనూ భక్తికీ శృంగారానికీ సమాన గౌరవంవుంది. నిజం చెప్పాలంటే భక్తి తల్లిలాంటిది. చల్లగా జోకొట్టి నిద్రపుచ్చుతుంది. శృంగారం ప్రేయసిలాంటిది. నిద్రపోతున్నవాణ్ణి వెచ్చగా తట్టిలేపుతుంది.

మనిషికి నిద్రకంటె ప్రియమైనది ఏది? శృంగారమేకదా! శృంగారం వున్నచోట నిద్ర వుండదు. శృంగారం శాంతించి పడగ దించితేనే తప్ప నిద్ర గదిలోపలికి అడుగు పెట్టజాలదు.

ఆడవాళ్ళు, మగవాళ్ళు నిద్రను విదిలించి పారేస్తూ విహరిస్తున్నారు. దొంగ నవ్వులు! దొంగచూపులు! దొంగచాటు సరసాలు!

సుందరం నడుస్తున్నాడు. తంబుర శ్రుతి, గుమ్మెత్త దరువు వినిపించాయి. అతడు ఆ మూలకు నడిచాడు. అక్కడ ఓ ముగ్గురు మనుషులు బుర్రకథ చెబుతున్నారు. వారి చుట్టూ జనం కూర్చుని వింటున్నారు. సుందరం ఒక ప్రక్కగా నిలబడి కొంతసేపు కథ విన్నాడు. అతని ప్రక్కన ఎవరో దగ్గారు. అతడు తిరిగి చూశాడు. గౌరి తీవిగా నిలబడి అతనివైపు చూస్తోంది. ఆచూపుల్లో కొంచెమైనా కదలిక లేదు. 'చూపులు—నువ్వు మరల్చుకుంటావో, నేను మరల్చుకుంటానో చూద్దాంకానీ' అన్నట్లు — పందెం వేసినట్లుగా చూస్తూవుంది. సుందరం కళ్ళలో సూదులు పొడుచుకున్నట్లు — కళ్ళు విలవిలలాడాయి. అతని చూపులు క్రిందికివాలి, మళ్ళీ బుర్రకథ వాళ్ళమీద నిలిచాయి.

సుందరం మరోక్షణం మాత్రమే అక్కడ నిలబడి, వెనక్కి నడిచాడు. ఓచోట కొయ్యగుర్రాలు ఆడుతున్నాయి. జనం ఎగబడి ఆ ఆట చూస్తున్నారు. ఓ ఐదు నిమిషాలసేపు ఆడి, గుర్రాలు ముందుకు కదిలాయి. ఆ గుర్రాలవెంట నడవడానికి — జనం ఒకళ్ళొకరు తోసుకున్నారు. ఆ ఊపులో ఓ అమ్మాయి విసురుగా పడి

పోతూ, సుందరంమీదికి వాలింది. అతడు తటాలున ఆమెను పడిపోకుండా పట్టుకున్నాడు. ఆమె అతన్ని విదిలించుకుంటూ దూరంగా జరిగింది. ఆమె గౌరి అని అతని కంతవరకు తెలియలేదు. పెదాలు బిగించి, గౌరి అతనివైపు చురచురా చూసింది.

సుందరం జనాన్ని నెట్టుకుంటూ గబగబా దూరంగా వెళ్ళిపోయాడు. గుడిదగ్గర ఆగాడు. వెనక్కు తిరిగి చూశాడు. గౌరికనిపించలేదు. అతను తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు.

'ఆమె గౌరి అని నాకేం తెలుసు?...అసలు ఎవరయితే మాత్రమేం' పడిపోతూవుంటే చివాలున పట్టుకున్నాను. బాకులు విసురుతున్నట్టు అలా చూస్తుందేం?.. ఛీఛీ! ఈ గౌరి లేకపోతే తిరణాల ఎంతో బాగుండేది!...వోరుజారి ఒకమాట అన్నందుకే దేహశుద్ధి చేయించింది. ఇక ముట్టుకుంటే, నెత్తురు కళ్ళజూడదూ?... ఆ నాగరాజు పరమనీచుడు! మీ అమ్మాయేవచ్చి నామీద పడిందండీ అంటే వింటాడా?...నువ్వు లాక్కపోతే ఎందుకొచ్చి పడుతుందిరా జులాయి వెధవా-అంటాడు. పిచ్చి కుక్కను కొట్టినట్లు కొడతాడు. వాడు కొట్టగలడు. కొట్టించగలడు. నాకు కండబలం లేదు. మరెందుకో కొట్టలేను కొట్టడానికి డబ్బిచ్చి కూలివాణ్ణి కుదుర్చుకోవడం కూడా నాకు తెలియదు. జాగర్త్తరా సుందరం! నీ ప్రథమ శత్రువు పోతాను-గౌరిరూపంలో తిరణాలలో తిరుగుతున్నాడు!'

బిడ్డలులేని ఆడవాళ్ళు కొందరు చన్నీళ్ళలో మునిగివచ్చి గుడిముందర వరుసగా బోరగిల పడుకున్నారు. భక్తులు వాళ్ళను దాటుకుంటూ వెడుతున్నారు అలా దాటితే పిల్లలు పుడతారని నమ్మకం కద్దు

సుందరానికి ఆ నమ్మకం చిత్రంగా కనిపించింది.

'పాపం! ఏడుస్తూ పుట్టి, ఏడుస్తూ బతికి, ఏడుస్తూ వెళ్ళిపోయే బిడ్డ తనకూ ఒకటి కావాలని అలా పడుకున్నారు. ఎందుకంత ఆరాటం వాళ్ళకు? ఆడవాళ్ళు గనుకనా? ఔనౌను! ఆడవారి సంపదల్లో గణనీయమైంది మాతృత్వం. తల్లి కాలేని స్త్రీ-నేను గొడ్రాల్ని అనుకుని తనలో తానే కుమిలిపోతుంది. ఆ గొడ్రాలితనం పోగొట్టుకోవాలన్న కోరికతోనే కదా, వాళ్ళు అలా పడుతున్నారు! చన్నీళ్ళలో మునిగి, ఒంటికి అంటుకుపోయిన బట్టలతో గజగజలాడిపోతూ పడుకున్నారు. భర్తముందు అలా కనిపించడానికి సిగ్గుపడే ఆడదికూడా బిడ్డ పుడుతుందనే ఆశతో యిక్కడ యిలా పడుకొంది. అయ్యో పాపం! లోకంలో ఎన్ని రకాల విషాదాలున్నాయి! పెళ్ళికాకముందే గర్భం ధరించి, దిగులుపడిపోయే వాళ్ళు కొందరు; పెళ్ళయి పన్నెండేళ్ళయినా-కడుపున ఒక్క కాయ కాయలేదే అని కుంగిపోయే వాళ్ళు కొందరు! తల్లులకు నిందతేబోతున్నారనే నిరసనవల్ల కడుపుల్లోనే కరిగిపోయే ఆ పిల్లలు వీళ్ళ కడుపుల్లో పుట్టరాదూ?...ఆశ చెడ్డది! గుడ్డిది! అది ఏ మాటనైనా నమ్మమంటుంది. భక్తులు తమను కాళ్ళతో తొక్కి వెళ్ళినంత మాత్రానికే బిడ్డలు పుట్టిపోతారా? ఏ సూర్యుణ్ణో, దేవేంద్రుణ్ణో పార్థిస్తే చక్కావచ్చి బిడ్డను చేతికిచ్చి పోవటానికిదేమన్నా పురాణకాలమా?...బిడ్డ ఎలా పుడుతుంది?... సుందరం ఆలోచనలు చీకట్లోకి వెళ్ళి తలుపులు మూసుకున్నాయి.

అతనికి సిగ్గు వేసింది.

కంటిపాపల్ని కాల్చివేసేంత తేజోవంతమూ, దుర్నిరీక్ష్యమూ, తాపకారణమూ అయిన అగ్ని ప్రాణికి జీవనాధారం కావడం ఎంత చిత్రమైన విషయం!...కామం అలాంటిదే! ఎర్రగా కాలిన ఇనుపగోళంలాంటి కామంలోంచి ప్రాణం పుడుతోంది.

సృష్టి స్థితిలయాలను నిర్వహిస్తూన్న దివ్యశక్తులు రెండే రెండు! కామం, మృత్యువు.

ఇది కామం; అది మృత్యువు!

ఇది ఎర్రగా, ప్రకాశవంతంగా వుంటుంది; అది నల్లగా, నిదితుని చుట్టూవున్న చీకటిలా వుంటుంది!

ఇక్కడ వేడి, చైతన్యం వున్నాయి; అక్కడ చల్లదనం స్తబ్ధత వున్నాయి!

మనిషి యిక్కడ మంచీ చెడ్డా రెండూ చేస్తాడు; అక్కడ ఏదీ చెయ్యడు!

ఇక్కడ బిడ్డ క్యారుమంటుంది; అక్కడ ముసలివాడి మూలుగు ఆగిపోతుంది!

ఇది జాగ్రత; అది నిద్ర!

పలపలమరిగే ఈ ఎర్రటి కామప్రవాహం సృష్టి ఆదినుండీ ఇలా ప్రవహిస్తూనేవుంది. నిరంతరమైన సూర్య తేజంలా – అక్షయంగా ప్రాణవృష్టిని కురిపిస్తూ, వసుంధరకు బిడ్డలులేని లోటును తీరుస్తూనేవుంది. ఇది యిలా ప్రవహించి ప్రవహించి, మృత్యువు అనే నల్లని, చల్లని మహా సాగరంలో సంగమిస్తోంది.

ఈ ఎర్రటి కామగోళం పూర్తిగా కరిగిపోయే దెప్పుడు ?

ఆ నల్లటి మృత్యుబిలం పూర్తిగా కప్పుకు పోయేదెప్పుడు ?

...వద్దు, వద్దు! ఓ కాముమా! నువ్వు పూర్తిగా కరిగి పోవద్దు! నువ్వు లేకపోతే ఈ ప్రపంచమే లేదు నువ్వే లేనినాడు– ఈ కొండలు, కోనలు, నదులు, జలపాతాలు, నేల, నింగి, గాలి, వాన అన్నీ నిరర్థకం! నువ్వు చిరంజీవిగా వర్ధిల్లు! విశ్వమంతటా నువ్వే నిండిపో! మా కళ్ళకు కనిపించే ఊర్ధ్వ లోకాల్లోనూ నీ సామ్రాజ్యాన్ని విస్తరింపజెయ్యి! నా తల్లికి కట్టినట్టే – నా పెత్తల్లులకు, పిన తల్లులకు, ఇంకా దూర దూరాల్లో కాపరాలు చేస్తున్న ఆ తెల్లటి చుక్కలకు పచ్చని కోకలు కట్టు! వాళ్ళ గొడ్రాలితనం పోగొట్టి, చవిటి పర్రల్లాంటి వాళ్ళ ముఖాలమీద నవ్వులు మొలకలెత్తించు!

అతనికి సుశీల జ్ఞాపకానికొచ్చింది. తనలోనుండి విడిపోయి, స్త్రీగా జన్మించిన తన అర్ధశరీరం ఆమె! ఆ పలుచని పెదాలు, నున్నని బుగ్గలు, సన్నని మెడ, పొంకంగావున్న కుచాలు, నల్లటి జడకుచ్చుల్ని ఉయ్యాలలూపే గుండ్రని పిరుదులు, మెత్తని పొత్తి కడుపు, ఆ సొగసూ ఆ వయసూ అన్నీ తనవే!... గత ఆదివారం రాత్రి తానేంచేశాడు ? ఆమెను ముద్దెట్టుకున్నాడు. కావిలించు కున్నాడు. చాపల్యంచేత ఆమె యౌవనాన్ని చవిచూడబోయాడు. ఇద్దరికీ మత్తెక్కింది. అంతలో- తనలో పొంగిపరుగులు పెట్టే రక్తానికి ఆనకట్ట పడిపోయింది. రక్తం తన వేగాన్ని ఆపుకోలేక సుళ్ళు తిరిగిపోయింది. కొద్దిక్షణాలు జానకీపతి రాకుండా వుంటే ఏమై వుండేది ?...

సుందరం రక్తం వేడెక్కింది.

...సుశీల అడ్డు చెప్పలెదు. అణువునా తననే స్మరిస్తూన్న సుశీల ఎలా అడ్డు పెడుతుంది ?

పెళ్ళి అయ్యేంతవరకు ఆగితేచాలు! తరువాత ఒకరిబొందిలో ఒకరు కాపురం చేసుకోవచ్చు! అమృతంలాంటి ఒకరి ఎంగిలి మరొకరు తింటూ, యౌవనాన్ని పావనం చేసుకోవచ్చు!... పూలదండలా సున్నితమైన, సుకుమారమైన, సుందరమైన సుశీల కడుపులో బిడ్డ పుడుతుంది. అది తన బిడ్డ! తనబిడ్డ సుశీల కడుపులో ప్రాణం పోసుకుంటుంది.

'సుశీ! ఓ నా ప్రాణమా! నా బిడ్డకు తల్లికావడానికి మన సారా కోరుకుంటున్న దేవతా! నీ ఋణం ఎలా తీర్చుకోగలను ? జీవితాంతంవరకు నిన్ను పూజిస్తాను. నిన్ను పూజించటానికి ఈ ప్రపంచంలో పూచే పువ్వులన్నీకూడా చాలవు. నిన్ను నా ముద్దులతో ఆరాధిస్తాను! నీకు నా ముద్దులు! ఎన్ని ?... వాటిని లెక్కపెట్టు కోను. అంత పెద్ద సంఖ్యలకు పేర్లుకూడాలేవు. అవి ఊహకుకూడా అందవు. ముద్దులు! నీ ఒళ్ళంతా ముద్దులు పెడతాను! తామర పువ్వులవంటి నీ పాదాలకుకూడా నా ముద్దులు! వాటిని నా కళ్ళ కద్దుకుంటాను. నా గుండెలమీద పెట్టుకుంటాను. నా బిడ్డను కడుపున మోస్తూ ఆ పాదాలమీదనేగా నుంచుంటావు నువ్వు ? వాటిని నా చెంపకు ఆనించుకుని నిద్రపోతాను...'

సుందరం ఓ దుకాణం దగ్గర నిలుచున్నాడు. తాను సుశీలకు ఏదైనా కొంటే బాగుంటుంది. రిబ్బన్లున్నాయి. గాజులున్నాయి. ప్లాస్టిక్ పువ్వులున్నాయి. చౌకబారు నకిలీ ఆభరణాలున్నాయి!... అట్టముక్కలకు వేలాడుతోన్న ముత్యాలహారాలు అతన్ని ఆకర్షించాయి. అవి చాలా అందంగా వున్నాయి. అన్నీ లేతరంగుల్లోవుండి, జలపాతం క్రింద చెదిరిపోయే నీటి బిందువుల్లో ప్రతిఫలించే వెన్నెల చినుకుల్లా వున్నాయి.

అతడు ఓ గులాబీరంగు హారాన్ని తీసుకుంటూ 'ఈ హారం ఎంతండీ??' అన్నాడు.

'ఆరురూపాయలివ్వండి!'

సుందరం కొట్టువాడికి డబ్బిచ్చి వెనక్కి తిరిగాడు. గౌరి ఆ హారాన్ని చూస్తూ ప్రక్కనే నిలబడి వుంది. మెల్లగా ముఖం పక్కకు తిప్పి, కొట్లోని వస్తువుల్ని చూడసాగింది.

సుందరం ముందుకు సాగాడు.

చలి ఎక్కువైంది. మంచుకురుస్తోంది. దీపాలచుట్టూ మసకగా ఇంద్రధనుస్సులు ఏర్పడుతున్నాయి. అతని దుస్తులు, ఒళ్ళు చల్లబడిపోతున్నాయి.

ఇందరు ఆడవాళ్ళలో ఒక్క సుశీల వుండరాదూ?

అరే!...అదిగో సుశీల! అటువైపు తిరిగి నుంచుంది ఆమే కదూ? సన్నగా, పొడుగ్గా వుంది. జడకుచ్చులు బరువుగా వూగుతున్నాయి. ఆ ఒయ్యారం సుశీలదే! అంత అందమైన వీపు ఆమెకు తప్ప మరెవరి కుంటుంది? అయితే, సీతాకోక చిలుకలా అలాంటి రంగురంగుల బట్టలు సుశీల కట్టుకుంటుందా? ఎర్రని జాకెట్టు ఆకుపచ్చనిపరికిణీ! పసుపు పచ్చని వోణీ!

ఆ అమ్మాయి యిటువైపు తిరిగింది. కాటుక కళ్ళు తళతళ లాడుతున్నాయి. ఎర్రటి పెదాలమీద నవ్వు తీగలు సాగుతోంది. ఒక చెయ్యి నడుంమీద వుంచుకుని మరో చెయ్యి బొడ్డుమీదుగా మడిచి పెట్టుకుని, నృత్యం చెయ్యడానికి ముందు నిలబడే భంగిమలో వుంది. సుందరం నిరాశ చెందాడు. ఆమె సుశీల కాదు.

కొందరు పిల్లలు బీడీ ప్రకటనలు అంటించిన అట్టముక్కలు చేతబట్టుకుని కేకలు పెడుతూ వస్తున్నారు. మనుషుల నెత్తిమీద బీడీలు కురుస్తున్నాయి. సీతాకోక చిలుకలాంటి ఆ అమ్మాయి ఇటు వేపే నడిచివస్తోంది. ఆమెకాళ్ళలో అందెలు ఘల్లుఘల్లు మంటు న్నాయి. ఆమె ముఖంలో చిందుతున్న నవ్వు, నడకలోని ఊపు చూస్తుంటే-ఒకే సమయంలో ఎందరో మగాళ్ళను తృప్తిపరచ జాలి నంత లాలసత్వం ఆమెలో కన్పిస్తోంది.

ఆమె దగ్గరగా వచ్చింది. ఆమె చుట్టూ పెద్ద గుంపు కదిలి వచ్చింది. ఆమె ఆగింది. అరే! నృత్యం చేస్తోంది. నడుము ఎంత బాగా కదులుతోంది! చేతులు ఎంత అందంగా వంపులు తిరుగు తున్నాయి! ఆమె ఆడుతూ పాట పాడుతోంది. పాట శ్రావ్యంగావుంది. గొంతు చిత్రంగా వుంది! మొగగొంతులాంటి ఆడగొంతు! ఆడగొంతు లాంటి మగగొంతు! ఆమె ఆడపిల్లకాదు! మగవాడే! ఆడపిల్లకంటే బాగున్నాడు

అకస్మాత్తుగా సుందరం చూపులకు గౌరి కనిపించింది. ఆమె అతనికి ఎదుటివైపున నిలబడి వుంది. ఇద్దరు ఆడవాళ్ళ భుజాల వెనుకనుంచి దొంగచూపులు చూస్తోంది. ఆమె చూపులతో సుందరం చూపులు కలుసుకోగానే, ఆమె పెదాలమీద మధువులాంటి నవ్వు వొలికింది. సుందరం గుండె ఝల్లుమంది అనుకోకుండా ఎదురైన తుఫాను వేగానికి నిలకడ కోల్పోయే చిలుక రెక్కల్లా-అతని కళ్ళు తటతటలాడి కిందికి వాలిపోయాయి.

గౌరి నవ్వింది!...ఆ నవ్వులో కత్తిపదును వుంది. ఆ కళ్ళలో కైపులున్నాయి. సందేహ నివృత్తికోసం సుందరం మళ్ళీ ఓమారు-క్షణంలో పదోవంతుకాలం-ఆమెవైపు చూశాడు. ఆమె తననే చూస్తూ వుంది. నవ్వు-ఆమె ముఖంలో తాటాకు మంటలా ధగ ధగ మంటోంది

సుందరం అక్కడ నిలబడలేకపోయాడు. దూరంగా వెళ్ళి పోయాడు. విషనాగు తనను తరుముకొస్తున్నట్లుగా వుందతనికి. గొగి కంటబడకుండా దాక్కోవాలనిపిస్తోంది ఈ దీపాలన్నీ ఆరి పోయి, కారుచీకట్లు ఆమె కళ్ళకు గంతలు కడితే బాగుంటుందని పిస్తోంది 'గౌరి నీలో ఇలాంటి విపరీతమైన మార్పు వస్తుందని నే ననుకోలేదు. నన్ను చూచి అలా నవ్వకు, నా కంటికి కనిపించకు. నీ నవ్వు ద్రాక్షారసంలావుంది. అది-నా గుండెల్ని చీల్చేసి, నారక్తాన్ని గుటగుటా తాగేసి, నా ఎముకల్ని చప్పరించి వుమిసివేయగలిగినంత శక్తివంతంగా కనిపిస్తోంది. ఆనవ్వు మాసిపోనీ! ఆ నవ్వుకంటే నీ ద్వేషమే మనిద్దరికి అరోగ్యకరం! ...'

ఈ రాతికి బుద్ధిలేదు ఇది కళ్ళులేని కబంధరాక్షసి! ముక్కుదాకా తాగి, దీనికి మత్తెక్కింది. దీనికి వున్నవి రెండే! బ్రహ్మాండమైన కరువు, తీరని ఆకలి! దీనికి తృప్తి లేదు దయ లేదు. హృదయంలేదు. ఇది - తనకేదో ప్రమాదానికి రంగాన్ని సిద్ధంచేయబోతున్నది!

ప్రమాదం!

గౌరి తనతో చెలగాటమాడుతూవుందా?

లోకంలో జరిగే హత్యలకు, అత్యాచారాలకు మూలకారణాలు ఎన్నైనా వుండవచ్చు. ఆడది, ఆస్తి, అభిమానం. అసూయ! వీటిలో ప్రముఖస్థానం ఆడదానిదే! ఆత్మహత్య స్త్రీలలో ఎక్కు వగా వున్నట్లే, హత్యలకు కూడా స్త్రీలే ఎక్కువగా కారణం అవుతుంటారు! ··· గౌరి తనను చూచి అలా నవ్వటం వాళ్ళ వాళ్ళెవరైనా చూస్తే? ప్రమాదమే!... పైగా గౌరి సామాన్యు రాలు కాదు. నిప్పులాంటిది! కాగితం నిప్పుమీదపడ్డా, నిప్పు కాగితం మీద పడ్డా- భగ్గుమనేది కాగితమే!

ఇప్పుడు రామలింగం తనకు తోడుగావుంటే బాగుండేది. అతని ఆనందంకోసం తనను యిలా వదిలేసి వెళ్ళిపోయాడు. తనతో వాడికేంపని? సృష్టిలో తీయనిది స్నేహం అంటారు స్వజాతి స్నేహంకంటే విజాతిస్నేహం-ఆడా మగా స్నేహం-మరింత తీయగా వుంటుందేమో? తాటిబెల్లంలాంటి ఆ నల్లటిపిల్ల దొరికిం తర్వాత-ఇక మగవాడిస్నేహం వాడికెందుకూ?...సుందరానికి కోపం వచ్చింది. రామలింగం కనిపిస్తాడేమోనని చుట్టూ ఓ సారి వెదికాడు. రామ లింగం అంత సులభంగా కనిపిస్తాడా? ఎప్పి వాకిళ్ళ గొళ్ళెం పెట్టుకుని లోపలికి వెళ్ళిపోయాడో!

గుడిముందరనుంచి పూల తేరు కదిలివస్తోంది. జనం విరగ బడిపోతున్నారు.

సుందరం రోడ్డుమీదికి వచ్చాడు.

రోడ్డువారవున్న టీకొట్టు ప్రక్కగా – పట్టుచీర కట్టుకున్న ఓ కొత్త పెళ్ళికూతురు నిద్రకళ్ళతో, నిద్రపోనివ్వని కోరికలతో, భర్త భుజంమీద తలవాల్చి కూర్చునివుంది. అతడు ఆమె వీపు నిమురుతున్నాడు. వర్షంలో తలదాచుకోవటానికి చోటు దొరకని కుక్కపిల్లలా కామం మూలుగుతోంది. వారివెనుకవున్న గోడమీద చిత్రించిన బొమ్మలో నాలుగు తలలు, ఎర్రత్రికోణం వున్నాయి.

'ఇద్దరు, లేక ముగ్గురు చాలు!'

చలిగాలి మంచుకత్తిలా శరీరాన్ని కోసివేస్తోంది. యుద్ధభూమిలోని విగత జీవుల్లా–అంతటి చలిలోనూ, కొందరు మనుషులు రోడ్డువారపడి నిదపోతున్నారు.

సుందరం తలపైకెత్తి చూశాడు.

ఆకాశంలో చుక్కలు ఆరిపోయాయి.

తప్పతాగి కేళీగృహంలోకి ప్రవేశించిన విటునిలా ఆకాశం అస్పష్టంగా వుఱుముతున్నది.

*   *   *

చీకటి!

ఉత్సవకోలాహలం క్రమంగా దూరమైంది.

మసకవెలుతుర్లు వెనుకపడ్డాయి.

సుందరం రోడ్డుమీద నడుస్తున్నాడు. అతనికాళ్ళు తిమ్మిరెక్కిపోయాయి. రంగులరాట్నంలోంచి కిందికి దిగినప్పటినుంచి ఇంత వరకూ కాస్సేపైనా కూర్చోలేదు. ఆటవిక జాతులవారి ఆసురీ మహోత్సవంలావుంది తిరణాల. ఆ పరిసరాలకు దూరంగా వెళ్ళి కూర్చోవాలనిపిస్తోంది.

ఆ తిరణాల అతనికి అశాంతికరంగా తోచింది. అక్కడ వట్టి అల్లరితప్ప మరింకేమీ లేదు. శరీరం ఎక్కడ తన స్వాధీనం తప్పిపోతుందోనని భయంవేసింది. తనకు పగలైనా కావాలి, లేదా ఒంటరితనమైనా కావాలి.

అలసిన కాళ్ళు భారంగా నడుస్తున్నాయి. చీకట్లోదారి స్పష్టంగా కనిపించటంలేదు. అగ్గిపెట్టె ఒకటి కొనుక్కువచ్చి వుంటే బావుండేది. అగ్గిపుల్లలు గీసుకుంటూ నడిచిపోవచ్చు ... ఈగాలిలో అగ్గిపుల్లలు నిలిచి మండుతాయా? గుప్పున ఆరిపోవూ?

వెనుకనుంచీ లారీ ఒకటి వస్తోంది. ఆ వెలుతుర్లో ఓసారి దారి చూసేసుకోవడం మంచిది!... వెనుక వస్తున్న లారీ మలుపు తిరిగింది. దాని వెలుగులు పక్కనున్న రైలుకట్టమీద పడ్డాయి. రైలుపట్టాలు మెరుపుతీగల్లా తళతళా మెరిశాయి. రోడ్డుమీద నడుస్తున్న సుందరం–కూపు గ్రహించేటంత మేర ముందరికి చూశాడు. కాస్త సమీపంలోనె రోడ్డు కిందికి వాలివుంది. ఏటిలోని ఎండుటిసుక తెల్లటి దుప్పటిలా కనిపించింది. లారీ ముందుకు వెళ్ళిపోయింది.

మరో నాలుగడుగులు నడిస్తేచాలు, అ ఏట్లో దిగి ఇసుకలో కూర్చోవచ్చు. సుందరం ఏట్లోకివచ్చి, చీకట్లోకి చూస్తూ, నిలబడ్డాడు. ఊపిరి బిగబట్టినట్లు నిశ్శబ్దంగావుంది నిశిధి. నీళ్ళలో తెడ్లువేసినట్లు ఓ ఆడదాని నవ్వు వినిపించింది. దూరంగా ఏటివార మొగిలిపొదల క్రింద బీడీనో, సిగరెట్టో వెలుగుతోంది. ఆ వెలుగు ప్రక్కనే తెల్లటిచీర మసకగా కనిపిస్తోంది.

సుందరం మళ్ళీ ముందుకు నడిచాడు.. అవి మొగిలిపొదలే! తనకు బాగా గుర్తు! పగటిపూట చాలాసార్లు తాను బస్సులో వెడుతూ ఆ మొగిలి పొదలను స్పష్టంగా చూశాడు. మొగిలి చెట్లలో మిన్నాగు లుంటాయట!...మరివాళ్ళు మొగిలిచెట్ల క్రిందే. మకాం పెట్టారే! ఎంత ధైర్యం! అందుకే అన్నారు, కామానికి కళ్ళులేవని!

వాళ్ళిద్దరూ ఎవరైవుంటారు?...అతని ఊహలో రామలింగం మెదిలాడు.. ఇంకెవరైనా ఎందుకు కాకూడదు?.. వాళ్ళు భార్యాభర్తలా? బావా మరదళ్ళా? కట్టుకున్న మొగుణ్ణో, పెళ్ళాన్నో మాయచేసి వచ్చి బులపాటం తీర్చుకుంటున్నవాళ్ళా? అదే అయివుంటుంది. అది అక్రమ సంబంధంకాకపోతే –స్థలకాల నియమాలు పాటించకపోవలసినంత తొందరేముంది? భార్యాభర్తలే అయితే ఒక్కరోజు సహనం వహించలేరా?... అక్కడ ఆ టీకొట్టువార – ఆ కొత్తదంపతులిద్దరూ 'ఈశ్వరా!' అంటూ కూర్చోలేదూ, పాపం!

'...అయ్యో! నేను కామాన్ని ఒక రూపంలోనే చూశాను. దానికి యింకో రూపం కూడావుంది. ఒక రూపంలో పవిత్రత,

ఇంకోరూపంలో అపవిత్రతా వున్నాయి–దినంలో రాత్రీపగలూ వున్నట్టు శోభనంగదిలోకి వెళ్ళే పెళ్ళి కూతురి కామం చాలా పవిత్రమైనది. అర్ధరాత్రివేళ దొడి తలుపుతీసుకుని బయటకువెళ్ళే మగనాలికామం చాలా అపవిత్రమైనది. ఒకటి దేవుడి గుడిలో దీపం లాంటిది! రెండోది–వల్లకాటిలో మండే చితిలాంటిది! ఒకటి రక్షిస్తుంది! మరొకటి భక్షిస్తుంది!

ఆకాశంలో ఉరుములు ఎక్కువయ్యాయి.

మెరుపు మెరిసింది.

సుందరానికి సంతోషం కలిగింది.

తళుక్కున వెలిగి మాయమై పోయే ఫ్లాష్‌లైట్ ఫిలిం మీద బొమ్మను రికార్డు చేసేస్తుంది. ఫ్లాష్‌లైట్‌లాంటి ఈ మెరుపు సహాయంతో– ఈ పరిసరాలను తన కంటిలో రికార్డు చేసుకోవాలి.

సుందరం ఆగిపోయాడు.

మరో మెరుపు మెరిసింది

రోడ్డు ప్రక్కన నేల చదునుగావుంది. రాళ్ళూ, ముళ్ళూలేవు. శ్రమలేకుండా నడిచిపోవచ్చు, ఓ ఏభై గజాలదూరంలో విశాలమైన తెల్లటిబండవుంది.

సుందరం రోడ్డు విడిచి ఆ బండవైపు నడిచాడు. అతనికి అంధకారం అంటే భయంపోయింది చీకట్లో ఏముంది? ఏమీలేదు! వెలుతుర్లో కనిపించే వస్తువులే చీకటిలోనూ వుంటాయి. ప్రాణహాని కలిగించే జంతువులను గురించే–చీకట్లో భయపడాలి! శత్రుశేషం వుంచకూడదనేది మానవుడి నీతి! వాడెప్పుడూ ముందు జాగత్త! వాడొక్కడే బ్రతకాలి! వాడికి భయాన్ని, అనుమానాన్ని కలిగించేవన్నీ చావాలి! పులులు, సింహాలు మొదలైన క్రూరమృగాలన్నీ దాదాపుగా నిశ్శేషమై పోయాయి. మచ్చుకు మిగిలిపోయిన కొన్నిమాత్రం దూర దూరంగా పారిపోయాయి. జంతుభయం తీరిపోయింది. మనుషులు విశేషమై పోయారు ఇప్పుడు మనిషిని గురించి భయపడుతున్నాడు. మనిషికి మనిషి శత్రువై పోయాడు. శత్రుశేషం వుండరాదు గనుక. ఒకణ్ణి ఒకడు నరుక్కుచావాలి!

చీకట్లో ఏముంటుంది?

మనిషి వుంటాడు!

పాములూ, తేళ్ళూ కూడా వుండవచ్చు. అయితే అవి అరుదుగానే వుంటాయి!

'నాకు మనిషంటే భయంలేదు, చీకటంటే భయం!' అనవద్దు. అది ప్రగల్భం!

'నాకు చీకటంటే భయంలేదు, మనిషంటేనే భయం!' అను అదే నిజం!

మెరపుకాంతిలో–మనిషి, పాము, తేలు–ఈ మూడు విష జంతువులూ కనిపించలేదు సుందరానికి. అతడు మెల్లగా వెళ్ళి, బండ మీద కూర్చున్నాడు.

...ఇక్కడ హాయిగా వుంది.

మెదడును జోకొట్టే మత్తత, మనస్సును గుడ్డిగా చేసివేసే మిరుమిట్లు ఇక్కడలేవు. ఇక ప్రమాదంలేదు. పిశాచాల బారినుండి ఇక్కడికి–తన సుశీల దగ్గరికి పారిపోయి వచ్చేశాడు తాను. తన సుశీల యిక్కడే వుంది! ఈ చీకట్లోవుంది. ఈ చలిలో వుంది ఈ గాలిలో వుంది. ఆకాశంలో వుంది నిద్రపోతున్న ఈ ప్రకృతి గుండెలమీద వుంది తన హృదయంనిండా వుంది. ఆలోచనలకు అంతరాయం కలుగని ఈ ఏకాంతంలో సుశీల వుంది. మండుటెండలాంటి ఈ నడిరేయిపూట–సుశీలను గూర్చిన తలపోత–కానగిచెట్టు నీడలా హాయిగా వుంది. తనకు ఈ ఏకాంతమే చాలు!

సుందరం బండమీద వెల్లకిలా పడుకున్నాడు బండ చల్లగా వుంది. చలనంలేని ఈ కఠిన శిలలుకూడా పరిస్థితుల ప్రభావానికి గురికాక తప్పడంలేదు. మిటమిటలాడే ఎండలకు ఈ బండలు బీటలు పడిపోతాయి. మంచుకు, వానకు, చలికీ–మృతదేహాల్లా చల్లబడిపోతాయి. రక్తమాంసాలున్న మానవ శరీరాలు ఏపాటి? ఈ ఒడలు చాలా సున్నితమైనది. సుకుమారమైనది. కర్ణుడిపాలిటి శాపాల్లాగా ఈ శరీరానికెన్నో తాపాలు! ఆకలి దప్పులకు, బాధలకు, వ్యధలకు ఇది ఆహారం! అన్నం తక్కువైతే శోష! ఎక్కువైతే అజీర్తి! ఎండను భరించదు! చలికి ఓర్చుకోదు! బ్రతుకూ సమస్యే! చావు సమస్యే!...

'ఈ చలిని నేను జయించలేనా? ప్రయత్నిస్తాను. ఈ చలిలో నేనొక్కడే వున్నానా? ఈ బండలు. ఆ కొండలు, చీకట్లో కదల కుండా నుంచున్న చెట్లు ఎంత సహనంగా వున్నాయి! తెల్లవారగానే ఇవన్నీ మళ్ళీ ఊపిరి పోసుకుని, సంతోషంగా నవ్వుతాయి! నేనూ అలాగే స్థాణువులా చలిని భరించి, తెల్లవారేసరికి హాయిగా నవ్వు

తాను. ఆశావహమైన భవిష్యత్తు చేతిని భరించే శక్తిని ప్రసాదిస్తుంది. రేపు నాది! రేపు ఆదివారం! ప్రక్కనే రోడ్డు వుంది. తెల్లవారు జామున—నిర్మలంగా వెలిగే వెచ్చటి కళ్ళతో బస్సులు వెడుతుంటాయి. సుశీల వాళ్ళ వూరు ఇక్కడికి దగ్గరే! పదిమైళ్ళే! రేపు సుశీల దగ్గరుంటాను. చాటుగా ఆమె కంఠంలో ముత్యాలహారం వేస్తాను. చెవిలో నోరుపెట్టి, ఈ రాత్రి నాకేమనిపించిందో చెబుతాను. సుశీల సిగ్గుపడుతుంది. ఛీ, పో బావా—అంటుంది. ఆహా! ఎంత మంచి ఆదివారం! అందమైన ఊహలాంటి ఆదివారం! తరునము దాల కవతల క్షీర సముద్రంలాంటి ఆదివారం ...హే సూర్య భగవన్! తొందరగా ఉదయించవయ్యా మహానుభావా!'

సుందరం కళ్ళు మూసుకున్నాడు.

ఇంతే ..ఇంకేమీ ఆలోచించకూడదు. శరీరం, మనస్సూ రెండూ అలిసిపోయాయి. కదిలేశక్తి శరీరానికి, ఆలోచించేశక్తి మనస్సుకు లేవు ఓ నా సహచరులారా! ఇక మీ్రిద్దరూ వూసులాడుకోవటం చాలించండి! పడుకుని నిద్రపోండి! నాకు ఆవలింత కూడా వస్తోంది. నా కళ్ళు మండుతున్నాయి. చలికి దుప్పట్లులేవు. సుశీలను తలుచుకుంటూ నోరు మూసుకుని పడుకోండి! ఉయ్యాలలో క్యారుమంటూ ఏడ్చే కవలపిల్లల్లా మారాం చెయ్యకండి!... జో జో హాయీ...

అతడు గుండెలమీద చేతులు ముడుచుకున్నాడు. ముఖంమీద ఓ చినుకు పడింది. అతడు పెకిలేవలేదు. కళ్ళు తెరవలేదు. అలసిపోయిన అతని మెదడు ఎప్పుడో గాఢంగా నిద్రపోయింది. మేలుకున్న శరీరం మాత్రం చలికి వణుకుతోంది. మిన్ను విరిగి మీద పడ్డా — అతని మెదడు యిక మేలుకోదు.

చాలా దగ్గరలో గాజుల చప్పుడు వినిపించింది.

సుందరం చివాలున లేచి కూర్చున్నాడు.

అతని ఎదుట ఓ నల్లటి ఆకారం నిలబడివుంది.

'ఎవరు ?' అన్నాడు సుందరం.

'నేనే !'

'నేనే అంటే ?...'

ఎవరు ? దేవుడివా ? దేవుడుతప్ప ఇతరమైనదేదీ లేదంటుంది వేదాంతం.

...ఓ సన్నటి నవ్వు !

ఆకాశంలో మెరుపు మెరిసింది. ఆ మెరుపు నేలమీదికి దిగివచ్చినట్లుగా—గిట్లయెదుట ఎ రటి గౌరి నవ్వుతూ నిలబడివుంది. 'నే నెవరని ఈ మెరుపుకంటే స్పష్టంగా చెప్పగలనా ?' అన్నట్లు చూస్తూవుంది.

సుందరం గుండెలో ఉరుములు ప్రతిధ్వనించాయి. నిద్రపోతున్న అతని మెదడు ఉలికిపడింది.

'అబ్బ! ఇంతదూరం వచ్చావా! నీకు భయంలేదూ ?' అంది గౌరి.

...నేను అడగవలసినమాట నన్నడుగుతోందేమిటీ ?...గౌరీ! నాకు చీకటంటే భయంలేదు. నీకు మనుషులంటే భయంలేదు. నువ్వు చీకటికి భయపడుతున్నావు, నేను నీకు భయపడుతున్నాను ...

'ఇక్కడి కెందుకొచ్చావు ?' అన్నాడు సుందరం.

గౌరి అతనికి దగ్గరగా వచ్చికూర్చుంది. ఆమె గొంతు సిగ్గుతో జీరపోయింది. 'ఎవరూ చూడలేదులే' అంటూ తలవంచుకొంది.

ఛీఛీ!...ఆడదానిసిగ్గు ఎంత అందంగా వుంటుంది!... ఈ సిగ్గు అసహ్యంగావుంది. 'ఎవరూ చూడలేదులే!'—ఈ ఒక్కమాటలో తెరలోపలి మర్మంలా ఎన్ని అర్థాలున్నాయి!

...వికృతమైన ఊహల ఇనుప పాదాలక్రింద నా గుండె చితికిపోయి, చచ్చిన పాములా ఇక్కడ పడున్నాను నేను. గౌరీ! చచ్చిన పామును కొట్టడానికా నువ్వు వచ్చావు!...

సుందరం గుండె కొట్టుకుంటోంది. మాట్లాడాలంటే వగర్పు వస్తోంది. 'ఎందుకొచ్చావు ? అన్నాడు కాస్త కోపంగా.

'ఏం ? రాకూడదా ?' అంది ఆమె జాలిగా. అతని ప్రశ్న తన మనస్సుకు కష్టం కలిగించిందన్న భావాన్ని సూచించింది ఆమె స్వరం.

'నే నిక్కడికి నిద్రపోదామని వచ్చాను గౌరీ!'

ఆమె నవ్వింది.

'ఎంత చిత్రం! ఇంత చలిలో, ఈ చినుకుల్లో నీకు నిద్రపోదామనిపిస్తోందా ? ...అబద్ధం!'

'నిజం గౌరీ! నువ్విక్కణ్ణుంచి వెళ్ళిపో! నిద్రపోతానో,

లేదో చూడు!...నువ్వు వెళ్ళకపోతే, నేనే లేచి వెళ్ళిపోతాను.'

'అమ్మో! నాకు భయం!' అంటూ ఆమె అతన్ని లేవనియ్యకుండా చెయ్యిపట్టుకుంది.

'చెయ్యి విడిచిపెట్టు!'

'నీకు నామీద కోపం!'

'నీమీద నాకేం కోపం?'

'అవును. మావాళ్ళు నిన్ను కొట్టారుగా?'

'కొడితే కొట్టారు ఇప్పుడు మళ్ళీ ఇదేమిటీ?'

ఆమె జడకుచ్చులు తీసి బుగ్గలకు రాచుకుంటూ 'మావాళ్ళతో చెప్పన్నే!' అంది.

'ఛీ!!

'అలా నన్ను చిన్నబుచ్చకు సుందర్! నీపై నాకేమీ విరోధం లేదు వాళ్ళు నిన్ను కొట్టేనందుకు తరవాత నేనెంత బాధపడ్డానో నీకు తెలుసా?.. పాపం, నావల్లేకదూ నువ్వు దెబ్బలు తిన్నది?'

'ఇప్పుడెందుకదంతా?'

'...నువ్వు తిరిగి కొట్టకపోయినా, నీదే గెలుపు! నువ్వు చాలా ధైర్యవంతుడివి సుందర్! ఆ మాట అన్నావా - అని మా నాన్న నిన్ను అడిగినప్పుడు, నువ్వు పిరికివాడిలా అబద్ధం చెబితే చూడాలని ఆశ పడ్డాను. నువ్వు ధైర్యంగా నిజమే చెప్పావు. నేనే ఓడిపోయాను.'

'నిన్ను యింకా చిత్తుగా ఓడించడం నాకు ఇష్టంలేదు గౌరీ! వెళ్ళిపోదాం పద!'

'అబ్బ' చలేస్తూవుంది! ఎక్కడికి వెళ్ళినా ఇంతేగదూ?' అంటూ ఆమె వొయ్యారంగా అతని భుజంమీదికి వాలింది. ఆమె తలలో పువ్వులు ఘుమఘుమలాడాయి. చల్లని చెంప, వెచ్చ నిశ్వాస చెంపకు తగిలాయి.

సుందరం ఆమెను మెల్లగా నెట్టాడు.

'నువ్వు కొన్న ఆ గులాబీరంగు హారం చాలా బాగుంది. అది నాకు నచ్చింది.'

'అది నీకోసం కాదు.'

'అబ్బో! వేళాకోళం!' అని నవ్వుతూ గౌరి అతని మెడ చుట్టూ చేతులు వేసింది.

సుందరం కోపంతో పైకిలేచి, విసురుగా వెళ్ళబోయాడు. వెనుక అతని చొక్కా గుంజినట్లైంది. గౌరి పకపకా నవ్వుతోంది.

'గౌరీ! విడిచిపెట్టు!'

'నేను విడిచిపెట్టేదేమిటి? నువ్వే విప్పుకో!'

సుందరం తిరిగి చూశాడు తనచొక్కా చివర ఆమె కొంగు ముడివేయబడివుంది.

'ఏం కొంటెపనులివి?' అన్నాడు కోపంగా.

'ఏం కొడతావా? కొట్టు! ఎవరూ లేనిచోట ఆడపిల్లను కొట్టడం నీకే తగును!'

'ఛీ ఛీ! నీతో భలే తంటా వచ్చిపడింది. విప్పేసెయ్ మరి!' అంటూ చిరాకుపడ్డాడు సుందరం.

ఆమె తన కొంగును కిందికి లాగింది సుందరం కూర్చున్నాడు. ఆమె అతనికి దగ్గరగా జరిగింది. కొంగు ముడివిప్పుతూ— 'అది మహా జాణ!' అంటూ నవ్వింది.

'ఎవరు?'

'అదే! మాలతి!'

'మాలతి ఎవరు?'

'ఆ నల్లటిపిల్ల!...రామలింగంతో వెళ్ళింది చూడూ, అదీ!'

'రామలింగం మోసగాడు!'

'మాలతి కూడా! ... వాళ్ళిద్దరూ యిప్పుడెక్కడుంటారో చెప్పుకో చూద్దాం!'

'ఎక్కడుంటారు?'

'తెలియదు!' అంటూ నవ్వింది గౌరి. .'ఇప్పుడు మనిద్దరం యిక్కడున్నామని కూడా వాళ్ళకు తెలియదు.'

'గౌరీ!'

'ఊఁ?'

'ఇలా దగ్గరకురా!'

'...వచ్చాను. ఏం?'

అతడు ఆమెముఖాన్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు జాలి పడుతూ ఆమెకళ్ళలోకి చూశాడు. ఆ కళ్ళలో కామవాంఛ వాలికలు చూపుతూవుంది. ఆ వాంఛలో ప్రమాదకరమైన అమాయకత్వం కూడా తొంగిచూస్తోంది. అంత పెద్దపిల్ల అతనికంటికి పాపాయిలా కనిపించింది.

'నువ్వు చాలా గడుసుదానివనుకున్నాను. ఇంత వెర్రిదానిలా వున్నావేం?

ఆమె కొండ కొమ్మను ముద్దు పెట్టుకునే శరన్మేఘంలా పులకించి, అతని గుండెలమీద తల వాల్చుకోబోయింది.

'వద్దు గౌరీ!...నువ్వు మంచిదానివి! నామాట వింటావు మనిషి సహజంగా మంచివాడు. నదిలాంటివాడు. ప్రశాంతంగా పారే ఏరు మనకెంత మేలు చేస్తుంది! ఆ ఏటికి వరదలొస్తే ఊళ్లనే ముంచేస్తుంది. మనిషి తప్పుచేయటంకూడా సహజమే! తప్పు జరగబోయేముందు ఆలోచించాలి. నిగ్రహాన్ని పాటించాలి. అప్పుడు తప్పు జరగదు బతుక్కి మచ్చలు, మరకలు రావు. చిన్న ఉప్పురాయి పడితేచాలు, కడివెడు పాలు చెడిపోతుంది. చిన్న నిప్పు రవ్వ గాలికెగిరితేచాలు పచ్చని పందిరి బూడిదైపోతుంది. అదృష్టం లేని బతుకు బండలైపోవటానికి చిన్న తప్పేచాలు!. కోరిక సారా లాంటిది. సారావేపు చూసేకొద్దీ తాగుబోతుకి తాగాలనిపిస్తుంది కోరికమీద మనసు లగ్నం చేసేకొద్దీ, కళ్ళకు మైకం కమ్ముకుంటుంది. ఈరాత్రి దయ్యానికి పెత్తనం అప్పజెప్పి, దేవుడు తాగుబోతులా నిద్రపోతున్నాడు ఈ చీకటి, ఈచలి, చాటు వెతుక్కుంటున్న ఈ మనుషుల ఉన్మాదం అమాయకమైన మన మంచితనంమీద అసూయపడి, కుట్రచేస్తున్నాయి. నువ్వు తాగలేదు. నేనూ తాగలేదు అయినా-మత్తు మన నరనరల్లోకి జివ్వుమంటూ పాకిపోతోంది. ఆలోచన కళ్ళు మూసుకుంటోంది. గడిచిపోయిన సాయంకాలం, మళ్ళీ రాబోయే ఉదయం జ్ఞాపకం రావటంలేదు. కోరిక మనిషిచుట్టూ కాటుక ముద్దలాంటి కోటను కట్టేస్తుంది. ఆ కోటలోకి వెలుతురు రాదు. అంతా చీకటి! రంగులు కనిపించవు. ఆకారాలు కనిపించవు. ఎత్తుపల్లాలు కనిపించవు. అగాధంలో సుళ్ళు తిరిగే నల్లని నీళ్ళలాంటి కోరిక మాత్రమే వుంటుంది. దాని అంచులు కసాయికత్తిలా పదునైనవి. అది క్రూరమైనది. దానికి దయలేదు. దాని దాహం తీరేవరకు అది శరీరాన్ని అతి క్రూరంగా శాసిస్తుంది. చిత్రహింసలు పెడుతుంది వద్దు గౌరీ! ... ఈ కోరిక తుఫానులో దొర్లే సముద్రంలాంటిది. మనం దానిలో అడుగు పెట్టడం ప్రమాదం. తుఫాను అణిగిపోయాక- మునిగిపోయిన పడవల్లా మనం కోరికలకింద సమాధి అయిపోతాం. ఈ చిత్రహింసను భరించు గౌరీ!...మనకిలా పిచ్చిపట్టడం చాలా సిగ్గుచేటు! ఇప్పుడు మనకేమీ తెలియదు. తెల్లవారాక సిగ్గుపడతాం! ఒకరి ముఖాలొకరు చూసుకోలేము. ఎందుకిలా చేశామని బాధపడతాం. నువ్వెవరో, నేనెవరో! ఒకరి ముఖం ఒకరు చూసుకోకుండా, ఒకరిని గురించి ఒకరు ఆలోచించుకోకుండా మనం ఇన్నాళ్ళూ వుండలేదూ? ఇక రేపు, ఎల్లుండి, చచ్చిపోయే ఆ చివరిరోజు కూడా అలాగేవుందాం! ఇక్కడ మనం కలిసి తిరిగిన ఈ ఒకటి రెండు గంటల్లోనే మనబుద్ధి పెడదారి తొక్కడం ఇది వట్టి గారడీ!... ఇంక కొన్ని గంటలు గడిచిపోతే ప్రమాదం వుండదు గౌరీ! తెల్లవారిపోతుంది. ఈ తాపం చల్లారిపోతుంది. హాయిగా నీరెండ కాస్తుంది పచ్చగా చెట్లు నవ్వుతాయి. నువ్వు యింటికి వెళ్ళిపోతావు. ఈ రాత్రి పడిన బాధంతా మరిచిపోతావు. నీచుట్టూ మనుషులుంటారు. నీ చేతినిండా పని వుంటుంది. నీ మనస్సు-ఎముకల్ని నమిలే చెడ్డ తలపుల మీదికి పోకుండా, బుద్ధిగా వుంటుంది. మనం చాలా మర్యాదగా నడుచుకుంటాము. నీదారి నీది! నాదారి నాది! అది మంచి పద్ధతి గౌరీ! ... కోరికను జయించు! నావల్ల నీకేమీ ప్రమాదం వుండదు. నీకూ, నాకూ ప్రమాదాన్ని తెచ్చిపెట్టకు! ... మనస్సును మళ్ళించుకో! వేరే ఆలోచనలు పెంచుకో! నువ్వు పెళ్ళి కావల్సిన పిల్లవు! నీనాన్న నీకు తొందర్లో పెళ్ళిచేసేస్తాడు. నీభర్త నిన్ను కోరికోరి చేసుకుంటాడు. నువ్వు - వాసన చూడని పువ్వు అనుకుని అతడు ఆనందిస్తాడు. నీకు నిగ్రహం వుంది. అతనికోసం నీ పవిత్రతను కాపాడుకో గౌరీ!...

గౌరి ఆమాటలువిని దూరంగా జరిగింది. ఆమెనోట మాట రాలేదు సిగ్గుపడుతూ తలవంచుకు కూర్చుంది అవమానం ఆమె ముఖాన్ని నమిలేసింది:

చిటపటమని పడుతూవున్న చినుకులు ఒక్కసారిగా బలసత్తువను పుంజుకున్నాయి హోరున వర్షం ప్రారంభమైంది.

సుందరం పైకిలేచాడు. 'వెళ్ళిపోదాం రా గౌరీ! వాన ముంచుకొచ్చేస్తోంది!' అంటూ బండమీదినుంచి కిందికి వచ్చాడు. గౌరి పైకి లేచి మెల్లగా అతన్ని అనుసరించింది.

సుందరం రోడ్డుమీదికి వచ్చాడు. గౌరి నాలు గడుగులు వెనకబడింది అతడు వెనక్కి తిరిగాడు. ఆమె వంగి నేలమీద కూర్చున్నది.

'రా గౌరీ!'

ఆమె పలుకలేదు.

అతను దగ్గరకు వెళ్ళాడు.

గౌరి కూర్చుని ఏడుస్తోంది.

'ఎందుకూ?' అన్నాడతను.

'ముల్లు విరిగింది!'

'లాభి హిరోయ్! నాప్పి వింతో సేపు వుండదు.'

'లోతుగా దిగింది సుందర్!' అంటూ ఆమె ముల్లు లాగి పారేసింది అతనిచేయి పట్టుకుని పైకి లేచింది.

ఇద్దరూ చేయిచేయి పట్టుకుని రోడ్డుమీద నడుస్తున్నారు. ఉరుములూ, మెరుపులతో వర్షం కుండపోతగా కురుస్తోంది. మెరుపు ఫెళ ఫెళమంటూ మెరిసి మాయమైపోగానే చీకటి వికృతంగా నవ్వుతోంది.

ఇలా ఎక్కడికి నడవాలి? ఎంతదూరం నడవాలి? తల దాచుకోవటానికి చోటెక్కడుంది? నడవకుండా ఇక్కడే నిలబడిపోతేనేం? నిలబడిపోవడంకంటె, నడిచిపోతేనేం? వాళ్ళకేమీ తోచటంలేదు. నడుస్తున్నారు. వర్షం ఆగేంతవరకు తడవక తప్పదు. వాళ్ళు పూర్తిగా తడిసిపోయారు. ఇద్దరూ శిలాప్రతిమల్లా వున్నారు. శిలా ప్రతిమకు శరీరం, వస్త్రం వేరువేరుగా వుండవు. రెండూ ఏకంగానే వుంటాయి. వాళ్ళ బట్టలు శరీరాలకు అంటుకుపోయాయి. కాళ్ళకు బందాలు వేస్తున్నాయి. గాలి కొరడాదెబ్బల్లా ఛెళ్ళు ఛెళ్ళున వీస్తోంది. ఇద్దరూ ఊగిపోతున్నారు. వాళ్ళను ఎగరేసుకు పోతున్నట్లుగా ఓ గాలితెర వీచింది. గౌరి కాళ్ళు పైకి తేలిపోయాయి. ఆమె రెండు చేతులతో సుందరాన్ని గట్టిగా వాటేసుకుంది. అతడు తూలిపోబోయి, సత్తువంతా కూడదీసుకుని నిలదొక్కుకున్నాడు. ఆమె అతనిమీదికి ఒరిగిపోయి నడుస్తోంది. ఆమె చేతులు అతని భుజాలమీద వున్నాయి. వర్షంలో ముడుచుకున్న విషసర్పాల్లా ఆమె వక్షోజాలు అతనికి రాచుకుంటున్నాయి.

సుందరం ఆ స్పర్శకు వణికిపోతున్నాడు. ఆమె నిత్తులో అతనికి సమానంగా వుంది. ఆ శరీరం అతనికి భారంగా వుంది. గౌరికి కండపుష్టి, రక్తపుష్టి ఎక్కువగా వున్నాయి. వివేకంమాత్రం అల్పంగా వుంది. కాముడు వేళ్ళు ఎగదోస్తూ ఆమె శరీరంలో కూర్చున్నాడు. ఆమె శరీరం సలసల మరిగిపోతోంది. ఆమెమీద కురుస్తున్న వర్షం ఆవిరైపోతోంది.

కొంతదూరం నడిచిన తర్వాత, గౌరి అకస్మాత్తుగా ఆగిపోయింది. సుందరం కదలలేకపోయాడు. 'పద్దు! నడుద్దాం! నడుస్తూనే వుందాం!' అన్నాడు.

'నేను నడవలేను!'

'ఇక్కడ మునిగిపోతాం గౌరి! ఇది సముద్రం! ఒడ్డున పడదాం! ఈత కొడదాం! ఓపిక వున్నంతవరకూ ఈత కొడదాం!'

'నావల్లకాదు! నాకు ఓపికలేదా!'

అయ్యో, భగవంతుడా! ఇదేం పరిశోధన!

'నేను వెళ్తాను.'

గౌరి ఏడ్చింది. 'నీకు దయలేదు!'

సుందరం కాళ్ళు శిలలైపోయాయి. అతడు గజగజ వణికిపోతున్నాడు. ఇప్పుడేం చేయాలి?... ఏం చేయాలి?... దేవుడా! ఈ చీకట్లో నువెక్కడున్నావు? నన్ను కాపాడు!...నాకు స్మృతి తప్పిపోనంటోందేమిటీ? నాకు మూర్ఛ రానంటోందేమిటి?... నా ప్రాణం బొందిలోనుండి ఎగిరిపోయి, కాస్సేపు అలా షికారు తిరిగి రారాదూ?...

మెరుపు మెరిసింది!

ఆకులు రాలిన ఎండుచెట్టులాంటి మెరుపు!

ఉడుకెత్తిన రక్తప్రసరణంలాంటి మెరుపు!

రోడ్డుప్రక్కనే—ఎండిపోయిన వాగు!

అదిగో, రైలుకట్ట!

వాగుకు దారి యిస్తూ—చిన్న రైలువంతెన!

'సుందర్! ఆ వంతెనకిందికెళ్ళిపోదాం, పద!'

'అది రాకాసిగుహలా వుంది. వొద్దు వొద్దు!'

గౌరి అతని జుట్టుమీద చేయివుంచింది. 'ఏమిటే మొండితనం? ఇలా వానలో తడిస్తే ఒళ్ళు ఏమవుతుంది? చెప్పినట్టు వినాలి!' అంటూ తల్లిలా మెత్తగా మందలించింది. అతనిచేతిని ఒడిసిపట్టుకుని వంతెనవైపు దారితీసింది. అతనికి తాను తప్ప వేరే తోడులేదన్నట్లు, అతన్ని కాపాడే బాధ్యత తనదన్నట్లు — అతన్ని జాగ్రత్తగా నడిపించింది. ఇంకా పాలుమానని చంటివాడిలా సుందరం ఆమెవెంట నడిచాడు.

ఇద్దరూ వంతెన క్రిందికి చేరుకున్నారు. రాతిగోడవారగా ఇసుక మెట్టమీద నిలబడ్డారు. మెరపులు చీకటిని చీల్చివేస్తున్నాయి. చీకటి మెరపుల్ని మింగేస్తోంది. సుందరం పిచ్చివాడిలా నిలబడ్డాడు. చలికి అతని పళ్ళు కటకటలాడుతున్నాయి. ఒళ్ళు గగుర్పొడుస్తోంది.

గౌరి అతని ముఖంలో ముఖం పెట్టి చూచింది. 'చలిగా వుందా ?' అంది అతను మాట్లాడలేదు.

ఆమె తన వోణీ తీసివేసి, మడిచి పిండివేసింది. ఎర్రటి జాకెట్టులో ఎత్తుగావున్న ఆమె వక్షస్థలం జిగేల్‌మంది. 'తల తుడిచివేస్తానుండు' అంటూ అతన్ని తన గుండెల మీదికి వాల్చుకుంది వోణీతో అతని తలను తుడిచింది. 'ఇక్కడెంత బాగుందో చూడు! వానలో తడద్దామంటావు. నేనేం నిన్ను కొరుక్కుతింటానా ? నేను నీ జోలికి రాను! తెల్లారేదాకా యిక్కడేవుందాం!' అంది

వావజల్లు ఆమె వీపును తాకింది. తుడుస్తున్న ఆమెచెయ్యి ఆగిపోయింది. అతన్ని మరింతగా హత్తుకుంటూ 'చలిపోయిందా ?' అంది. ఆమె చేతిలోని వోణీ జారి క్రింద పడిపోయింది. ఆ చేతులు అతని జుట్టులోకి వెళ్ళాయి. అతని ముఖం మీద గబగబా ముద్దులు కురిపించిందామె. 'పాపం! నిన్ను చూస్తే నాకు జాలేస్తోంది!' అంటూ అతని వీపుచుట్టూ చేతులువేసి గట్టిగా కౌగిలించుకొంది.

సుందరం పెదవులు మాట్లాడలేక వణుకుతున్నాయి. అతని మాటలన్నీ రక్తంలోనే కరిగిపోతున్నాయి... ... గౌరీ! నిన్ను బతిమాలుకుంటాను. నన్ను ముట్టుకోకు! దూరంగా నిలబడు. నీ మెత్తటి వక్షోజాలు నా గుండెల్ని తొలిచేస్తున్నాయి నీవేడి ముద్దులు నన్ను కాల్చేస్తున్నాయి. నీ బిగి కౌగిలి నన్ను బందీ చేసేస్తోంది నీ చొరవ నామీద మంత్రం వేస్తోంది. నీ శ్వాస తాచుపాము బుసలా వుంది. నన్ను కాటు వేయకు మళ్ళీ! మట్టిలో కలసిపోయే ఈ శరీరాన్ని నేనెంతో భద్రంగా కాపాడుకుంటున్నాను. ఇది నాదికాదు. మరొకరిది. నా సుశీలది! దీనిపైన సర్వహక్కులూ ఆమెవే! ఆమె సొత్తును నువ్వు కాజేయటం తప్పుకదూ ? నీ శరీరాన్ని చల్లార్చుకునేందుకు మరొకరి శరీరాన్ని కాల్చివేయడం న్యాయమా ? అయ్యో, గౌరీ! ఇది తప్పు! మహాపాపం! ఈ పాపం నీకు తియ్యగా వుందా ?... ...అతని గుండె ఏడ్చింది.

వంతెనలోపలి పైభాగంలో సాలెగూటిలో ఈగ చిక్కుకుని, విలవిల తన్నుకుంటోంది. దానిచుట్టూ సాలెపురుగు సంతోషంతో నాట్యం చేస్తోంది.

ఆకలితో మేలుకున్న కామంలా వుంది గౌరి. ఆమె శరీరం కొలిమిలా మండిపోతోంది. తన బలాన్నంతా - సుందరాని, స్వాధీనం చేసుకోవడంలో కేంద్రీకరించింది దేవుడు ప్రార్థనకు వరమివ్వలేదు. ఆమె దేవుణ్ణే బలాత్కరిస్తోంది,

సుందరంలోని దృఢత్వం చివరిసారిగా తలయెత్తింది... వీల్లేదు! గౌరిలాగ తానుకూడా కామానికి లొంగిపోకూడదు. గౌరికి దయ్యం పట్టింది. ఆ దయ్యాన్ని తరుమగొట్టాలి. అతి ప్రయత్నం మీద అతని చేతులు పైకిలేచాయి. అతడు ఆమె భుజాలు రెండూ పట్టుకున్నాడు. ఆమెను దూరంగా విసిరి పారేయాలనుకున్నాడు. అతనికి వేయి ఏనుగుల బలం వచ్చింది.

అతని చెంపమీద ఆమె పెదవులు చుంబిస్తున్నాయి.

అతని మనస్సులోని సుశీల కిలకిలా నవ్వింది!...ఆనకట్ట తలుపుల వద్ద సుళ్ళు తిరుగుతూ ఆగిపోయిన రక్తప్రవాహం మళ్ళీ హోరుమంటూ పైకిలేచింది. దారి వెతుక్కుంటూ ఆనకట్ట తలుపుల్ని చిల్లులు పొడిచింది. సుందరం కూడదీసుకున్న శక్తి అతనికే ఎదురు తిరిగింది. గౌరి భుజాలమీద పడ్డచేతులు ఆమెను తీగల్లా చుట్టివేశాయి

పరవశించిన భూదేవిలా, గౌరి నవ్వింది!

వర్షం! వర్షం!! వర్షం!!!

ఊపిరాడనివ్వని ధృతరాష్ట్రుడి కౌగిలిలాంటి వర్షం! కత్తిచేత బట్టుకుని పగవాణ్ణి తరుముకుపోయే ఉన్మత్తుడిలాంటి వర్షం! గడ్డపలుగుల్లా భూమిమీదికి దిగబడి, పాముల్లా నాలుకలు చాపుతూ పాకుతూన్న వర్షం!

వర్షం వూగిపోతోంది. ప్రకృతిని వూపి పారేస్తోంది.

విద్యుత్తు బద్ధలై గుడ్డిగా పరుగులు తీస్తున్నట్టు ఆకాశం నిండా మెరుపులు! చల్లటి చేతి వేళ్ళలాంటి ఆ విద్యుల్లతాంతాల స్పర్శకు ప్రకృతి పులకించిపోతూ విరగబడి నవ్వుతోంది. ప్రకృతి సిగ్గు విడిచేసింది. చీర విప్పేసింది. దంతపు బొమ్మలా మెరిసిపోతూ నగ్నంగా నిలబడింది.

మేఘాలు రాక్షస మిథునంలా! ఒకదాన్నొకటి పెనవేసుకుంటూ దొర్లుతున్నాయి. ఆ చల్లని కౌగిలిలో తుపాకి గుండులా వేడి దూసుకుపోతోంది.

ఆకాశం పెటిలిపోతూ ఓ మెరుపు మెరిసింది. ఫెళఫెళమంటూ ఎక్కడో పిడుగుపడి భూమి లోతుల్లోకి చొచ్చుకుపోయింది. నేల తియ్యగా మూలిగింది.

ఆకాశం క్రుంగిపోతున్నది. నేల పొంగిపోతున్నది.

పర్వత శిఖరాలమీదికి బరువుగా వాలిపోయిన వర్షామేఘం కరిగి, నీళ్ళై జారిపోతోంది. దాహంతో అలమటించిపోతున్న నేల తపనా తీర్చుకుంటోంది.

పొడుగాటి గూడ్సురైలొకటి ధణధణమంటూ వంతెనమీద పరుగెడుతోంది.

(సశేషం)